సీఎం కప్ పోటీల్లో జిల్లాకు పేరు తేవాలి

నారాయణపేట రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలం



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలం

నారాయణపేట టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడా పోటీల్లో నారాయణపేట జిల్లాకు పేరు తేవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలం అన్నారు. పోటీల నిర్వహణపై కలెక్టరేట్‌లో బుధవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో విద్యార్థులు రాణించి, రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు. ఆరు కేటగిరీల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 7, 8న గ్రామ స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. 10 నుంచి 12 వరకు మండల, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు. క్రీడాకారులు ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వెంకటేశ్, డీఆర్‌డీవో మొగులప్ప, జడ్పీ సీఈవో జ్యోతి, డీఈవో గోవిందరాజులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి



పైతాన్‌ను పట్టుకున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. పర్యావరణంతోపాటు వన్యప్రాణుల సంరక్షణపైనా అవగాహన ఉండాలన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో మయూరి ఎకో పార్క్‌లో వనదర్శిని కార్యక్రమంతో పాటు స్నేక్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను విద్యార్థులు సందర్శించి, విజ్ఞానం పెంచుకోవాలన్నారు. జిల్లాలోని పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జడ్చర్ల బీఆర్ఆర్ డిగ్రీ, పీ జీ కళాశాల వృక్షశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సదాశివయ్య స్నేక్ షో నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సత్యనారాయణ, డీపీఆర్‌వో శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వార్డ్ అటవీశాఖ అధికారి రాంమోహన్ పాల్గొన్నారు.



జడ్చర్ల భూసార పరీక్ష కేంద్రంలో రైతులు తెచ్చిన మట్టిని పరీక్షిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

భూసారం.. అవశ్యం

- భూసార పరీక్షలతోనే సమృద్ధిగా పంటలు
- ఉమ్మడి జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా నేలలు
- ఎర్రమట్టి, నల్లమట్టి, దుబ్బ, మిశ్రమ, ఇసుక భూములు
- ప్రతీ రెండు మూడేళ్లకు ఒక పర్యాయం పరీక్షలతో మేలు
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో భూసార పరీక్ష కేంద్రం
- నేడు అంతర్జాతీయ మృత్తికా దినోత్సవం

6



మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో కిటికీలకు తలుపులు లేని ఎస్సీ సంక్షేమ వసతి గృహం



మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో కిటికీలకు తలుపులు లేని కేజీబీవీ



సంక్షేమం వణుకు

- గురుకులాలు, కేజీవీబీల్లో పెరిగిన చలితో విద్యార్థుల ఇబ్బందులు
- ఉదయాన్నే చన్నీటి స్నానంతో తరచూ జలుబు, దగ్గుతో సతమతం
- అద్దె భవనాల్లో అరకొర వసతులు
- కిటికీలు లేని భవనాలు.. నాణ్యత కొరవడిన భోజనం
- స్కావెంజర్లు లేకపోవడంతో దుర్గంధంగా మరుగుదొడ్లు, మెస్‌లు
- ప్రత్యేక అధికారులు మరింత దృష్టి సారిస్తే మేలంటున్న విద్యార్థులు

చలి తీవ్రత పెరిగింది... సాయంత్రం కాగానే ప్రజలందరూ ఇళ్లకు చేరుకొని వెచ్చగా ఉంటారు... కానీ, ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. సొంత ఖర్చుతో ఇంటి వద్దే చదువుకునే ఆర్థిక స్థోమతలేని చిన్నారులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హాస్టల్లో వసతి పొందుతున్నారు. కానీ, అక్కడ కనీస వసతులు కొరవడి అష్టకష్టాలు పడుతున్నారు. అద్దె భవనాల్లో తలుపులు, కిటికీలు, దుప్పట్లు, వేడినీరు వంటి కనీస సౌకర్యాలు లేక చలి తీవ్రతకు వణుకుతున్నారు. దీనికి తోడు పారిశుధ్యలోపంతో అస్వస్థతకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో 'ఆంధ్రజ్యోతి' బృందం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాస్టళ్లలో చేపట్టిన పరిశీలనలో వారి దుర్భర స్థితి మరోసారి వెలుగుచూసింది....

ఆంధ్రజ్యోతి పరిశీలన

మహబూబ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. గతంలో లేనంతగా ఈదురుగాలులు వీస్తుండటంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. నవంబరు చివరి వారం నుంచే చలి తీవ్రత ఎక్కువ కాగా, జనవరి చివరి వరకు ఈ ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ హాస్టళ్లు, కేజీవీబీలు, గురుకులాల్లో చలి తీవ్రత- విద్యార్థుల ఇబ్బందులు, ఇతరత్రా సౌకర్యాలపై ఆంధ్రజ్యోతి క్షేత్ర స్థాయి పరిశీలన చేసింది. సరిపడా దుప్పట్లు చాలాచోట్ల పంపిణీ చేసినప్పటికీ, హాస్టళ్లలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు వణుకుతున్నారు. చాలా గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో గదులు సరిపోక, కిటికీలు, తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఉదయమే చన్నీటితోనే స్నానం చేయాల్సిన పరిస్థితితో తరచూ జలుబు, దగ్గుతో సతమతమవుతున్నారు. జలుబు అంటు వ్యాధి కావడంతో ఒకరికి వస్తే ఆ గదుల్లో ఉన్న మిగతావారికీ సోకుతోంది. కొన్నిచోట్ల గదులు సరిగా లేకపోవడంతో విద్యార్థులు భోజనశాలలోనే నిద్రిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. మరికొన్ని చోట్ల అనువైన భవనాలు లేకపోవడంతో ఫౌల్ట్రీ ఫారాల్లోనూ గురుకులాలను కొనసాగించాల్సిన దయనీయ పరిస్థితులు ఉన్నాయి. ఆయా జిల్లాల కలెక్టర్లు గురుకులాలకు ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ ఇంకా పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందని విద్యార్థులు చెబుతున్నారు.

అమలుకాని మెనూ.. పెట్టింది తిను..

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎనిమిది బీసీ, రెండు మైనారిటీ, రెండు ఎస్సీ ఒక ఎస్టీ గురుకులాలు ఉన్నాయి. అయితే చాలావరకు గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీనివల్ల వేరే అవసరాల కోసం నిర్మించిన భవనాలు విద్యార్థులు వసతికి అనుగుణంగా లేవు. బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు సరిపడా లేకపోవడం, ఉన్నవి అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గురుకులాలకు కిటికీలు కూడా సక్రమంగా లేకపోవడంతో చలితీవ్రత ఎక్కువగా ఉంటోంది. వేడినీళ్లు అందించే

(మిగతా 7లో..)

తనిఖీలతో గాడిలో పెడుతున్నాం

- పనితీరు సరిగా లేని టీచర్లకు మెమోలు ఇస్తున్నాం
- ఐసీడీఎస్ నారాయణపేట జిల్లా ఇన్‌చార్జి పీడీ జయ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



నారాయణపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆకస్మిక తనిఖీలతో అంగన్‌వాడీ కేంద్రాలను గాడిలో పెడుతున్నామంటున్నారు ఐసీడీఎస్ నారాయణపేట జిల్లా ఇన్‌చార్జి పీడీ జయ. కేంద్రాలకు వచ్చే గుడ్లు నాణ్యతగా లేకుంటే తిప్పి పంపాలని, పిల్లలకు త్వరలో యూనిఫామ్స్ అందించనున్నామని చెప్పారు. బుధవారం ఆమె నారాయణపేట ఐసీడీఎస్ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

అంగన్‌వాడీల పనితీరు బాగోలేక విద్యార్థుల హాజరు తగ్గుతుందనే ఆరోపణలున్నాయి. దానిపై ఏమంటారు?

జిల్లా వ్యాప్తంగా నారాయణపేట, మక్తల్, మద్దూర్ ప్రాజెక్టుల పరిధిలో 704 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అవి 29 సెక్టార్లలో ముగ్గురు సీడీపీవోలు, 16 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ఆకస్మిక తనిఖీలతో అంగన్‌వాడీల పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆ సమయంలో ఏమైన లోటుపాట్లు ఉంటే మెమోలు జారీ చేస్తున్నాం. టీచర్లు, ఆయాలు ఇళ్లకు వెళ్లి విద్యార్థులను తీసుకొస్తున్నారు. కలెక్టర్ కూడా తనిఖీలు చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్లు న్యాణతగా లేవనే ఫిర్యాదులు వస్తున్నాయి?

నాణ్యమైన గుడ్లు సరఫరా చేయాలని కాంట్రాక్టర్లకు పదే పదే సూచిస్తూనే ఉన్నాం. గుడ్లు వచ్చినప్పుడు టీచర్లు పరిశీలించి తీసుకోవాలి. నాణ్యత లేకపోతే తిరిగి పంపించాలి. ఆ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలుపాలి.

పిల్లలకు యూనిఫామ్స్ ఇంత వరకు ఇవ్వలేదు. కారణం?

జిల్లాలోని స్కూల్స్‌కు ప్రభుత్వం నుంచి యూనిఫామ్స్ వచ్చాయి. వాటిని త్వరలో పిల్లలకు అందించేలా చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో ఎన్ని పాఠశాలలకు సొంత భవనాలు ఉన్నాయి? అద్దె భవనాల్లో ఎన్ని కొనసాగుతున్నాయి?

జిల్లాలో 704 అంగన్‌వాడీ పాఠశాలలకు గాను 131 స్కూల్స్‌కు సొంత భవనాలు ఉన్నాయి. 286 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా 287 కేంద్రాలు కమ్యూనిటీ హాల్స్, ప్రభుత్వ స్కూల్స్ సముదాయల్లో నిర్వహిస్తున్నారు.

మెజారిటీ స్కూల్స్‌కు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఎప్పుడు నిర్మిస్తారు?

పలు కేంద్రాలకు మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నాయి. కొన్ని చోట్ల లేవు. 203 కేంద్రాల్లో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

మాడల్ అంగన్‌వాడీ స్కూల్స్ ఎన్ని ఉన్నాయి?

నారాయణపేట, జాజాపూర్‌లలో మాడల్ అంగన్‌వాడీ స్కూల్స్ కొనసాగుతున్నాయి. త్వరలో మక్తల్‌లో కూడా ప్రారంభించనున్నాం. అన్ని కేంద్రాలను మాడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో అంగన్‌వాడీ, ఆయాల పోస్టులు ఎన్ని ఖాళీ ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 704 అంగన్‌వాడీలకు గాను 28 టీచర్ పోస్టులు, 157 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్రజా పాలన కాదు వంచన పాలన

బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

జడ్చర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని, ప్రజా వంచన పాలన అని బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యులు, బీజేపీ నాయకులు ఆచారీ ఆరోపించారు. జడ్చర్ల పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో బుధవారం నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు అబద్ధాలు చెప్పడంతో పాటు 66 మోసాలకు పాల్పడిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబరు తొమ్మిదిన రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తానని ప్రకటించి, నేటికీ కేవలం 40 శాతం మాత్రమే రుణమాఫీ చేశారని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తానన్న హామీ ఏమయ్యిందని ప్రశ్నించారు. రేషన్‌కార్డులు, నిరుద్యోగభృతి, రైతుబంధు, ఇందిరమ్మఇళ్లు తదితర ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని అడిగారు. రాష్ట్రంలో లక్షా 87 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, దమ్ముంటే వాటిని భర్తీ చేయాలని డిమండ్ చేశారు. 50 వేల ఉద్యోగాలు కల్పించామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయ్యిందని సంతోషపడ్డామని, కల్వకుర్తి బిడ్డగా కల్వకుర్తి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయడం లేదని అన్నారు. కుర్వగడ్డపల్లి, కొత్తపల్లి ప్రాంతాలలో ఇసుకను కొల్లగొట్టేందుకు గజ్వేల్ నుంచి ఒక మాఫియా వచ్చి, రైతుల పత్తి పంటను ధ్వంసం చేసి ఇసుకను తరలించేందుకు సిద్ధమైందని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలకు కనిపించడం లేదా? అని ధ్వజమెత్తారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అరాచకాలు, దమనకాండకు నిరసనగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు బాలాత్రిపురసుందరి తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లతో సృజనాత్మకత పెంపు

వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న పీయూ వీసీ శ్రీనివాస్ తదితరులు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పీయూలో ఎంబీఏ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ కమ్ సేల్స్ సృజనాత్మకత, ఊహాశక్తి పెంపొందించేలా ఉందని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా బుధవారం పాలమూరు యూనివర్సిటీలో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. వీసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో 61 రకాల ఆహార పదార్థాలు, ఆటలు, ప్రాసెస్ చేయబడిన వస్తువులు, పునఃవిక్రేత వస్తువులను విక్రయించేందుకు 20 స్టాల్స్ ఏర్పాటు చేశారు. 400 మంది పీయూ, ఆదర్శ, స్విట్స్ కళాశాలల విద్యార్థులు ఈ స్టాల్స్‌ను సందర్శించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు సొంత వ్యాపార నిర్వహణ నైపుణ్యాలను పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ నూర్జహన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కృష్ణయ్య, కన్వీనర్ ఎస్ఎన్ అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రోడీకరణ వేగవంతం

సమగ్ర కుటుంబ సర్వే వివరాలు నారాయణపేట జిల్లాలో 98 శాతం కంప్యూటరీకరణ



మద్దూర్‌లో ఆన్‌లైన్ క్రోడీకరణను పరిశీలిస్తున్న జిల్లా ప్రణాళిక అధికారి యోగనంద్

నారాయణపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ క్రోడీకరణ వేగంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 98 శాతం కంప్యూటీకరణను పూర్తి చేశారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా ప్రణాళిక అధికారి యోగానంద్ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా 1,200 మంది ఆపరేటర్లు సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. జిల్లాలో 1,55,999 కుటుంబాలను గుర్తించగా, లక్ష్యానికి మించి 1,58,999 కుటుంబాల వివరాలను సేకరించారు. అందులో ఇప్పటి వరకు 1,57,264 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ 98 శాతం పూర్తయ్యిందని, రెండు రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రణాళిక అధికారి యోగానంద్ తెలిపారు.

జిల్లాలోని మునిసిపాలిటీలు, మండలాల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలు

మునిసిపాలిటీ/ మండలం	సర్వే చేసిన కుటుంబాలు	ఆన్‌లైన్ చేసిన కుటుంబాలు	శాతం
నారాయణపేట మున్సిపాలిటీ	10,741	10,741	100
మక్తల్ -	6710	6710	100
కోస్గి -	5962	5834	98
నారాయణపేట మండలం	16084	16084	100
కోత్తపల్లి -	5713	4919	86
దామరగిద్ద -	15530	15530	100
ఊట్కూర్ -	15,226	15,226	100
మక్తల్ -	14,011	14,011	100
మద్దూర్ -	13012	12.018	92
మరికల్ -	10630	10630	100
నర్వ -	10,146	9483	93
మాగనూర్ -	7699	7699	100
ధన్వాడ -	9693	9693	100
కోస్గి -	5962	5962	100
గుండుమాల్ -	5256	5256	100
మొత్తం	159887	157264	98

క్రీడల్లో రాణించి.. కొలువు సాధించి

- ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన ఉమ్మడి పాలమూరు జిల్లా యువకులు
- స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాల సాధన

7

చిరుత దాడిలో.. ఏడు గొర్రె పిల్లలు మృతి

మహబూబ్‌నగర్ జిల్లా ఇబ్రహీంనగర్‌లో ఘటన

6

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

- జెన్‌కో సేఫ్టీ డీఈ శ్రీకుమార్‌గౌడ్



పాతాళగంగ మత్స్యకారులతో మాట్లాడుతున్న డీఈ శ్రీకుమార్‌గౌడ్

దోమలపెంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రం నుంచి శ్రీశైలం డ్యాంలోకి నీటిని రివర్స్ బుల్ పంపింగ్ (నీటిని ఎత్తిపోసే ప్రక్రియ) చేసే సమయంలో మత్స్యకారులెవరూ చేపల వేటకు ఎగ్జిట్ టన్నెల్ వైపు వెళ్లొదని జెన్‌కో సేఫ్టీ డీఈ శ్రీకుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం కుడి, ఎడమ పాతాళగంగ మత్స్యకారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ బ్యాక్ వాటర్‌ను రివర్స్ బుల్ పంపింగ్ చేసే సమయంలో నీటిని జనరేటర్స్ వేగంగా లాగుకుంటాయని, దీంతో అటు వైపు మత్స్యకారులు, వలలు వేయడం, పడవలు తిప్పడం చేయకూడదన్నారు. కొద్ది రోజులు ట్రయల్ రన్ చేయడం జరుగుతున్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని డీఈ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సేఫ్టీ ఏడీఈ రాము, మురళీమోహన్, ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున్, మత్స్యకారులు సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, జెన్‌కో అధికారులు ఉన్నారు.

చిరుత దాడిలో ఏడు గొర్రె పిల్లలు మృతి

కోయిలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిరుత దాడిలో ఏడు గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని ఇబ్రహీంనగర్‌లో బుధవారం సాయంత్రం చోటుచేసుకొంది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇబ్రహీంనగర్‌కు చెందిన బొంగు కుశలయ్య గొర్రె పిల్లలను గ్రామ సమీపంలోని కొండ గట్టు వద్ద జాలిలో వేసి గొర్రెలను మేపడానికి వెళ్లాడు. వచ్చి చూసే సరికి జాలిలో ఉన్న ఆరు గొర్రె పిల్లలు రక్తపుమడుగులో మృతి చెంది ఉన్నాయి. ఒక గొర్రె పిల్లను చిరుత ఎత్తికెళ్లినట్లు సమీప పొలాల రైతులు తెలిపారు. వారం రోజులుగా ఖిల్లా సమీపంలో చిరుతలు కనిపించాయని గ్రామస్థులు తెలిపారు. బాధిత రైతును అటవీశాఖ అధికారులు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు కోరారు.

భూసారం.. అవశ్యం

- ● భూసార పరీక్షలతోనే సమృద్ధి పంటలు
- ● ఉమ్మడి జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో నేల స్వభావం
- ● నేడు అంతర్జాతీయ మృత్తికా దినోత్సవం

జడ్చర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భూసారంతో సమృద్ధి పంటలు పండించుకోవచ్చు. భూమిలో సారం ఎంత ఉందో తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. ఈ పరీక్షలతో రైతులకు కలిగే ప్రయోజనాలను తెలిపేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం అంతర్జాతీయ మృత్తికా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భూసార పరీక్ష కేంద్రం ప్రధాన కేంద్రం జడ్చర్లలో ఉంది. కాగా, ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధమైన నేలలు ఉన్నాయి. ప్రధానంగా ఎర్రమట్టి నేలలు, నల్లమట్టి నేలలు (నల్లరేగడి), దుబ్బ, మిశ్రమ నేలలు, ఇసుక నేలలు, ఎర్రబంక నేలలు ఉన్నాయి.



జడ్చర్ల భూసార పరీక్ష కేంద్రంలో రైతులు తెచ్చిన మట్టికి పరీక్షలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

భూసార పరీక్షలను నిర్వహించుకుంటే రైతుకు ఎంతో ప్రయోజనాలున్నాయి. భూమిలో ఉన్న సారంతో పాటు పోషకాలు, లోపాలు తెలుస్తాయి. వీటితో పాటు నత్రజని, పొటాషియం, పాస్పరస్ ఎంత ఉందో తెలుస్తుంది. పంటలకు రసాయన ఎరువులను అధికంగా వినియోగిస్తుండటంతో ఏ మేరకు ఎంత వినియోగించుకోవాలో భూసార పరీక్షలతో వెల్లడి అవుతుంది. ప్రతీ రెండు, మూడు సంవత్సరాలకు ఒక పర్యాయం భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.



పరీక్ష కేంద్రానికి రైతు తీసుకువచ్చిన మట్టి

భూసార పరీక్షలకు వ్యవసాయ పొలంలో సరాసరిగా మట్టిని సేకరించాల్సి ఉంటుంది. చెట్టునీడ, గట్లున్న స్థలం, పెంట కుప్పలు, నీరు నిల్వ ఉన్న స్థలం, ఎరువులు పోసిన స్థలంలో మట్టిని సేకరించవద్దు. ఒక ఎకరా పొలంలో 20 స్థలాల్లో మట్టిని సేకరించాలి. నాగలిలోతు 'వి' ఆకారం వచ్చేలా 15, 30 సెంటీమీటర్ల పొడువు, వెడల్పు గుంతలో మట్టిని సేకరించాలి. సేకరించిన మట్టిని నాలుగు భాగాలు కుప్పలు పోయాలి. అర కేజీ మట్టి వచ్చే వరకు ఎదురెదురుగా ఉన్న కుప్పలు తీసేయాలి. ఆ మట్టిని ఒక కవరులో పోసి, భూసార పరీక్ష కేంద్రంలో ఇవ్వాలి. ఆ మట్టికి భూసార పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తారు.

జిల్లా వారీగా..

- ● మహబూబ్‌నగర్ జిల్లాలో ఎర్రమట్టి నేలలు 67శాతం ఉండగా, నల్లమట్టి నేలలు 20 శాతం, దుబ్బ, మిశ్రమ నేలలు 13శాతం ఉన్నాయి. క్షారస్వభావం కలిగి ఉన్న ఈ నేలలో వరి, జొన్నలు, రాగులు, సజ్జలు, కందులు, మొక్కజొన్న, వేరుశనగ, మిరప, ఆముదం పంటలు పండిస్తారు.
- ● నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎర్రమట్టి నేలలు 62శాతం, ఇసుక నేలలు 29శాతం, నల్లమట్టి నేలల 9శాతం ఉండగా, తక్కువ నీటిని నిల్వ చేసుకునే విధంగా ఉన్నాయి. పత్తి, మొక్కజొన్న, వరి, వేరుశనగ పంటలు పండిస్తారు.
- ● వనపర్తి జిల్లాలో ఎర్ర నేలలు 47శాతం, మట్టినేలలు 42శాతం, నల్లమట్టి నేలలు 11శాతం ఉన్నాయి. వరి, వేరుశనగ, జొన్నలు, మొక్కజొన్న, కంది, పత్తి, ఆముదం పంటలు పండిస్తారు.
- ● జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎర్ర ఇసుక నేలలు 50శాతం, ఎర్రబంక నేలలు 30శాతం, నల్లమట్టి నేలలు 20శాతం ఉన్నాయి. వరి, జొన్నలు, పసుపు, మిర్చి, రాగులు, సజ్జలు, పత్తి, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, కందులు పంటలు పండిస్తారు.
- ● నారాయణపేట జిల్లాలో ఎర్ర ఇసుక నేలలు 53శాతం, ఇసుక నేలలు 32శాతం, నల్లమట్టి నేలలు 15శాతం ఉన్నాయి. వరి, జొన్నలు, పత్తి, పప్పుజాతి పంటలు, వేరుశనగ, ఆముదం, రాగులు, సజ్జలు, మొక్కజొన్న, కూరగాయలు పండిస్తారు.

భూసార పరీక్షలు చేయించాలి

ప్రతీ రెండు, మూడు సంవత్సరాలకు ఒక పర్యాయం తమ భూమికి సంబంధించిన మట్టికి భూసార పరీక్షలు చేయించాలి. దీంతో భూమిలో ఉన్న సారం ఎంతో తెలుస్తుంది. పోషకాలు, లోపాలు తెలుస్తాయి. ఏ ఏ ఎరువులను ఎంత మోతాదులో వినియోగించుకోవాలి భూసార పరీక్షలతో తెలుస్తుంది.

- గ్రేస్ ఏవాంజలిన్, ఏడీఏ, భూసార పరీక్ష కేంద్రం, జడ్చర్ల



పచ్చదనాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- మెడికల్ అంబులెన్సు ప్రారంభం
- అడవి మంటలను ఆర్పే బ్లోయర్లను అటవీ శాఖకు అందజేసిన ఐసీఐసీఐ ఫౌండేషన్



మన్ననూరులో వన్యప్రాణి సంరక్షణ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఎఫ్‌డీ రాంబాబు, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

మన్ననూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, అడవులు, వన్యప్రాణులను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు పర్యాటక వనమాలిక ఆవరణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అపోలో టోటల్ హెల్త్ సంస్థ వారు అడవిలో ఉండే చెంచులకు వైద్యశిబిరాలు నిర్వహించేందుకు మంజూరు చేసిన ఆరోగ్య అంబులెన్సును అటవీ అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

ఐసీఐసీఐ ఫౌండేషన్ వారు అటవీ శాఖకు అందించినటువంటి అడవిలో మంటలు ఆర్పే బ్లోయర్లను ఫైర్ వాచర్లకు అందజేశారు. ప్లాస్టిక్ నిషేధం చేసేందుకు పర్యావరణ హితమైన జనపనార సంచులు, మార్పటాకులతో విస్తరాకులను తయారు చేసే యంత్రాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో 33శాతం పచ్చదనంతో కూడిన అడవులు ఉండాల్సిన అవసరం ఉందని, పచ్చదనం తగ్గి కాలుష్యం పెరిగితే ప్రపంచానికి రక్షణ కవచమైన ఓజోన్ పొర దెబ్బతింటుందని అన్నారు. పర్యావరణ సమతుల్యత లోపిస్తే వర్షపాత నమోదు శాతం తగ్గుతుందన్నారు. జిల్లాలో 39 శాతం అడవులున్నప్పటికీ ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అడవిలో మంటలు వ్యాపించకుండా స్థానికులు సిగరేట్ కాల్చడం, ఎక్కడపడితే అక్కడ మంటలు పెట్టడం మాని అడవుల సంరక్షణకు సహకరించాలన్నారు. దేశంలోనే రెండో అతి పెద్దదైన నల్లమలను సందర్శించేందుకు ఇష్టపడుతుంటారని, నల్లమలలో అటవీ నిబంధనలకు అనుగుణంగా ఉంటే పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. నల్లమలను టూరిజం హబ్‌గా మార్చి స్థానికులకు ఉపాధి కల్పించాలన్నదే తన ధ్యేయమన్నారు.

అటవీ క్షేత్ర సంచాలకులు(ఎఫ్‌డీ) రాంబాబు, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, ఎఫ్‌డీవో రామమూర్తి, రేంజ్ అధికారులు దేవజ, వీరేశం, గురుప్రసాద్, డీఆర్‌వో రవికుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెండు రోజులుగా పస్తులు

- నిలిచిన మధ్యాహ్న భోజనం
- ఇంటి నుంచే అన్నం తెచ్చుకోమంటున్న హెచ్‌ఎం



దోమలపెంట ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాల

దోమలపెంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రెండు రోజులుగా మధ్యాహ్నం భోజనం వండకపోవడంతో విద్యార్థులు పస్తులు ఉంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని దోమలపెంట ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో పాతాళగంగ , ఈగలపెంట, మత్స్యకారుల కాలనీ(ఇంక్లాండ్ టన్నెల్) దోమలపెంట గ్రామాలకు చెందిన 51 మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ 5 నుంచి 10 వరకు తరగతుల నిర్వహణ చేపడుతున్నారు. పేద విద్యార్థులకు ప్రతీ రోజు మధ్యాహ్న భోజనం పాఠశాలలో వండవల్సి ఉంది. అయితే గత రెండు రోజుల కిందట బియ్యం అయిపోయాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోకపోవడం వల్లనే తమ పిల్లలు పస్తులు ఉండవల్సి వస్తున్నదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలకు బియ్యం వచ్చేవరకు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ప్రతీ నెల పాఠశాలకు రావల్సిన బియ్యం సక్రమంగా అందకపోవడం వల్లనే వంట చేయడం లేదని ఉపాధ్యాయ సిబ్బంది పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఒకపక్క ఆదేశాలు ఇస్తున్నప్పటికీ ఇక్కడ మాత్రం పరిస్థితి ఇలా ఉంది. దోమలపెంట పాఠశాలలో రెండు రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచిపోయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ విషయంపై బుధవారం హెచ్‌ఎం నాగయ్యను వివరణ కోరగా, తమ పాఠశాలకు గత నెల రావాల్సిన బియ్యం అందకపోవడంతో మధ్యాహ్న భోజనం వండటంలేదని చెప్పారు. వచ్చే బియ్యం కూడా పురుగులు పట్టి ఉండటంతో తేలేదని, మంచి బియ్యం వచ్చే వరకు విద్యార్థులు తమ ఇంటి నుంచి భోజనం తెచ్చుకోక తప్పదని అన్నారు.

● సమస్యను తెలుసుకొని పరిష్కరిస్తాం

ప్రతీ రోజు పాఠశాలలో భోజనం వండేందుకు సరిపడ బియ్యం ఉంచుకోవాలి. దోమలపెంట పాఠశాలలో విద్యార్థులు పస్తులు ఉంటున్న విషయం తెలువదు. స్థానిక అధికారుల నుంచి సమాచారం తెలుసుకొని సమస్య పరిష్కరిస్తా.

- రమేష్ కుమార్, డీఈవో నాగర్‌కర్నూల్

ఎద్దులేని ఎవుసం



క్యాతూరు గ్రామంలో కందిలో అంతరపంటగా వేసిన మొక్కజొన్న పంటను హార్వేస్టరుతో సేకరిస్తున్న దృశ్యం

అలంపూర్ చౌరస్తా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు ఎద్దులను తమ కుటుంబ సభ్యుల్లో ఒకరిగా చూసుకుంటూ పోషించేవారు. ప్రతీ రైతు ఇంట్లో కనీసం ఒక జత, కాస్త పెద్ద రైతుల ఇళ్లల్లో రెండు నుంచి పదులసంఖ్యలో ఎద్దులు ఉండేవి. తమ తమ పిల్లలు వ్యవసాయం నుంచి దూరం కావ డంతో పాటు పోషణభారంతో ఎద్దులతో పాటు పశుసంపద కూడా క్రమేణా తగ్గిపోయింది. దీంతో రైతు జీవితంలో భాగమైన ఎద్దు మాయమవుతున్నది.

ఎద్దుల స్థానాన్ని ట్రాక్టర్లు ఆక్రమించి అంతకుమించి పని చేస్తున్నాయి. ఒక ఎకరం పొలం గంటలో దున్నడం, పెల్లలు కరిగేందుకు వర్షంకోసం ఎదురు చూడాల్సిన పని లేకుండా రోటావేటర్‌తో నూర్పిడి చేయడంతో సేద్యం పూర్తవుతుంది. ఇక విత్తనం వేయాలంటే మనుషుల సాయం లేకుండానే ట్రాక్టర్లతో పాటు నడిచే విత్తన పరికరాలను ఉపయోగిస్తున్నారు. కలుపు తక్కువ ఉంటే మనుషులను మించిపోతే పంటనుబట్టి సాళ్లమధ్య పిచికారి చేస్తే గడ్డి పూర్తిగా అంతమయ్యే మందులు అందుబాటులోకి రానే వచ్చాయి. ఇక మందుల పిచికారికి కూడా ట్రాక్టర్లనే ఉపయోగిస్తున్నారు. వైపర్ల సాయంతో పంటల్లో విస్తరంగా వెదజల్లడమే గాక నిమిషాల్లో పూర్తవుతుంది. ఇంకా ఆధునికంగా డ్రోన్‌ల సాయంతో మందులు పిచికారి చేస్తున్నారు. దీని వల్ల పంటకు నష్టం జరగకపోవడమేగాక, క్రిమిసంహారక మందుల మోతాదు తగ్గడం వల్ల రైతుకు డబ్బు ఆదా అవుతుందని డ్రోన్ మల్లెందొడ్డి గ్రామానికి చెందిన పైలట్ పరశురామ్ తెలిపారు.

మాయమవుతున్న ఎద్దులు

రైతులు యాంత్రీకరణ వైపు అడుగులు వేయడంతో పూర్వం నుంచి రైతులకు తోడుగా ఉన్న ఎద్దులు కాలక్రమేణా మాయమవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణాలు పోషణభారం. ఒకప్పుడు ధాన్యపుగింజలు పండించడంతో నూర్పిడి పట్టాకా మిగిలినది మేతకు వాడుకునేవారు. క్రమేణా కమర్శియల్ పంటలు సాగు చేస్తుండటం వల్ల పశువుల మేత కొనాల్సివస్తుంది. ప్రస్తుతం ఒక ట్రాక్టర్ వరిగడ్డి ధర రూ.14వేల నుంచి రూ.16వేలు పలుకుతుంది. ఒక జత ఎద్దులకు ఏడాదికి కనీసం రెండు ట్రిప్పులు గడ్డి ఆవసరం. దీనికి తోడు దాణా ఖర్చుతో పాటు, శీతాకాలంలో పచ్చిగడ్డి కోసుకొస్తూ వాటి సపర్యాలు కూడా చేయాలి. వేసవి దుక్కులంతా ట్రాక్టర్లతో చేయడం వల్ల ఏడాదిలో 8నెలలు ఎద్దులు ఖాళీగా ఉంటాయి కాబట్టి వీటికోసం ఇంట్లో ఒకరు ఇంటివద్దే ఉండాల్సిరావడం.. మిర్చి, వేరుశనగ, పప్పుశనగ, మొక్కజొన్న తదితర కొన్ని రకాల పంటలకు మాత్రమే అంతర సేద్యానికి ఎద్దులు ఉపయోగిస్తున్నారు. దీంతో నానాటికి ఎద్దుల సంఖ్య తగ్గుతూ యంత్రాల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. ఉమ్మడి జిల్లాలో 2015లో దుక్కికి పనికివచ్చే ఎద్దులు 35,142 ఎద్దులు ఉండగా.. ప్రస్తుతం 16,885 మాత్రమే ఉన్నాయి. 2015లో వ్యవసాయ ట్రాక్టర్లు 13,680ఉండగా ప్రస్తుతం 31,583గా ఉన్నాయి. ఇక హార్వేస్టర్లు ప్రస్తుతం 2394 ఉండగా ఇక ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగుభూమి 18లక్షల 26వేల 4ఎకరాలు ఉంది. భవిష్యత్‌లో వ్యవసాయ రంగంలో మరిన్ని కొత్తతరహా యంత్రాలు వచ్చే అవకాశం లేకపోలేదు.

కూలీలను కట్టిపడేసిన నగదు పథకాలు

ముఖ్యంగా కూలీల కొరతకు ప్రభుత్వాలు ఇచ్చే నగదు పథకాలతో కాలంవెళ్లదీసే వారి సంఖ్య పెరిగిపోవడమూ ఓ కారణమే. దీనివల్ల రోజువారి కూలీల సంఖ్య బాగా తగ్గిపోయిందనడంలో సందేహం లేదు. చిన్న చిన్న పనులకు మినహా మిగతా పనులకు యంత్రాలను వాడుతూ ఖర్చు, సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. వ్యవసాయ పనులు చాలా చోట్ల ఒకేసమయంలో ప్రారంభం కావడంచేత కూలీల కొరత ఏర్పడుతుంది. దీంతో ఒక్కో మహిళ కూలీ ధర రోజుకు రూ.200 నుంచి రూ.500వరకు పెరిగింది. పురుషుల కూలీలు రూ.400నుంచి రూ.700కు పెరిగింది. దీంతో రైతుకు ఆదాయం కంటే కూలీల ఖర్చే ఎక్కువ అవుతుంది.

ఎద్దులతో అంతర సేద్యానికి భలే డిమాండ్

క్రమేణా ఎద్దుల సంఖ్య తగ్గినా సరైన సమయంలో అంతర సేద్యాలు ఎద్దులతోనే చేయాలి. సరిగ్గా దీనినే కొంతమంది చిన్నకారు వ్యవసాయకూలీ రైతులు ఉపాధిమార్గంగా మలుచుకుంటున్నారు. పంటచేతికొచ్చే క్రమంలో ట్రాక్టరుతో సేద్యం చేస్తే పంటదెబ్బతినే అవకాశం ఉంటుంది కాబట్టి ఎద్దులతో అయితేనే సౌకర్యంగా ఉంటుంది.

ఆగస్టు నుంచి నవంబరు వరకు ఎద్దులకు భలే డిమాండ్ ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సీజన్‌కుముందు ఎద్దులను కొని అంతసేద్యానికి ఎకరాకు రూ.ఐదు వందల నుంచి రూ.ఏడు వందల వరకు తీసుకుంటారు.

ఇలా రోజూ ఐదు నుంచి ఎనిమిది ఎకరాల వరకు సేద్యం చేస్తారు. సీజన్ పూర్తికాగానే మళ్లీ అమ్మేయడం పరిపాటిగా మారింది.

ఈ చిత్రంలో కనిపిస్తున్న యంత్రం మాన్యువల్ సీడర్. దీని ధర రూ. ఆరు వేలు. ఈ యంత్రంతో పత్తి, మొక్కజొన్న, కంది, వేరుశనగ, పప్పుశనగ, సోయాబిన్, మినుముల విత్తనాలు విత్తవచ్చు. ఒక వ్యక్తి రోజుకు మూడెకరాలు విత్తనం వేయవచ్చు. అదే కూలీలతో విత్తితే ఎకరానికి రూ.2వేలు అవుతుంది. మూడెకరాల కూలీల ఖర్చుతో యంత్రమే వస్తుంది. ప్రతి ఏటా విత్తుకోవచ్చని రైతు గురుప్రసాద్ తెలిపారు.





కూలీల ఖర్చును భరించలేక సొంతంగా కలుపుతీసే యంత్రాన్ని చేసుకుని సేద్యం చేసుకుంటున్న రైతు (ఫైల్)

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

● అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఏకే జిలానీ



సమావేశంలో మాట్లాడుతున్న జిలానీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అవినీతిరహిత సమాజాన్ని నిర్మిద్దామని అందుకు ప్రతీ ఒక్కరు తమవంతుగా ముందుకు రావాలని అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఏకే జిలానీ అన్నారు. అవినీతిరహిత దినోత్సవాన్ని పురస్కనరించుకొని బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో అవినీతి ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను ఎలా బలహీన పరుస్తుందన్న అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఏకే జిలానీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి అవినీతి సమాజాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఏ విధంగా బలహీన పరుస్తోంది తెలుసుకొని... అవినీతి లేని సమాజాన్ని నిర్మించడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఏవరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు లంచం అడిగితే నిర్భయంగా అవినీతి నిరోధక శాఖను సంప్రదించాలన్నారు. టోల్ ఫ్రీ నెంబరు 1064కు ఫోన్ చేయాలన్నారు. అవినీతి నిరోధక వారోత్సవాలు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ అధికారులు లింగస్వామి, సీఎంవో బైకాని బాలు యాదవ్, విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ శంభూప్రసాద్, ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం విజేతలుగా నిలిచిన తెలుగు మీడియంలో వి.ఈశ్వర్ (షాషాబ్ గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల), ఎస్. శుదీక్ష (శిశు వికాస్‌గ్రామర్ స్కూల్), ఇంగ్లీస్ మీడియంలో అనీఖా ఐమాన్ ప్రతిభ ఉన్నత పాఠశాల, నిహారిక (శ్రీఅక్షర ఉన్నత పాఠశాల), సాహితి (లిటిల్ స్కాలర్స్ హైస్కూల్), ఉర్దూ మీడియం విభాగంలో సమ్రీన్ బేగం (మదీనా మజీద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల), మదీనా తబస్సుం ప్రభుత్వ పోలీస్ లైన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు గెలుపొందారు. వీరికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

గొంతు కోసుకొని మహిళ ఆత్మహత్య

మహమ్మదాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈలపీటతో గొంతు కోసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈలపీటతో గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో నివసిస్తున్న పుష్పమ్మ కుటుంబ కలహాలు భరించలేక ఈలపీటతో గొంతు కోసుకొన్నది. గమనించిన భర్త రాములు ఆమెను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందింది. ఈ మేరకు కొత్తపల్లి మండలం గొకులారం గ్రామానికి చెందిన మృతురాలి తల్లి బొంత సాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుల ఎన్నిక

● ఎన్నికల ఫలితాల ఆధారంగా జిల్లాల కమిటీల నియామకం

మహబూబ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. రెండు నెలల క్రితం అన్ని జిల్లాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలకు ఆన్‌లైన్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలు పూర్తై ఫలితాలు వెలువడ్డాయి. వీటిని యూత్ కాంగ్రెస్ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఎక్కువ ఓట్లు వచ్చిన వారిని అధ్యక్షులుగా రెండోస్థానంలో ఉన్నవారిని ఉపాధ్యక్షులుగా నియమించారు. ఇలా ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాలకు సంబంధించిన అధ్యక్షుల నియామకాలు పూర్తయ్యాయి. వారికి వచ్చిన ఓట్ల ఫలితాలను కూడా వెల్లడించారు. కొన్ని చోట్ల ఇద్దరి మధ్య అధ్యక్ష స్థానానికి తీవ్ర పోటీ జరగగా, మరికొన్ని చోట్ల ముగ్గురు పోటీ పడ్డారు. మహబూబ్‌నగర్‌లో ఆరుగురు, వనపర్తిలో తొమ్మిదిమంది, నారాయపేటలో ఐదుగురు, నాగర్‌కర్నూల్‌లో ఎనిమిది మంది, గద్వాలలో ఐదురుగురు పోటీ పడ్డారు.

- ● మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఉన్న ఆవేజ్ అహ్మద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇక్కడ మొత్తం 24,772 ఓట్లు పోలవగా అందులో అవేజ్ 9621 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికవగా, మహేశ్‌కుమార్ 6083 ఓట్లతో ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.
- ● నాగర్‌కర్నూల్ జిల్లాలో 12392 ఓట్లు పోలవగా అందులో కొత్తపల్లి వినోద్‌కుమార్‌కు అత్యధికంగా 6896 ఓట్లు రాగా ఆయన అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 4690 ఓట్లతో రాజేశ్ ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు.
- ● వనపర్తి జిల్లాలో 14136 ఓట్లు పోలవగా ఆదిత్య 8212 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికవగా, 4227 ఓట్లతో దివాకర్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.
- ● జోగుళాంబ గద్వాల జిల్లాలో 13482 ఓట్లు పోల్ అవగా అందులో రంగన్నగారి తిరుమలేష్ 8941 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికవగా, 4406 ఓట్లతో చిట్టెం పురుషోత్తంరెడ్డి ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.
- ● నారాయణపేటలో 9775 ఓట్లు పోలవగా అందులో కొత్త మధుసూదన్‌రెడ్డి 5511 ఓట్లు సాధించి యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులు కాగా, 3841 ఓట్లతో మనోజ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

క్రైం కార్నర్

విగ్రహ ధ్వంసం నిందితుల అరెస్ట్

» విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో సీఐ మహేశ్, ఎస్ఐ గోకారి

కోడేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పురాతన గణపతి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం కోడేరు పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలోని ఉమా మహేశ్వర ఆలయం సమీపంలో ఉన్న పురాతన గణపతి విగ్రహాన్ని గత నెల 26న గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం ధ్వంసం చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన మహబూబ్‌పాషా, హుస్సేన్‌బాషా, ఉస్మాన్‌లుగా గుర్తించారు. వారిలో మహబూబ్‌బాషా, హుస్సేన్‌బాషాలను విచారించగా నేరం ఒప్పుకున్నారని, ఉస్మాన్ పరారీ లో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. విగ్రహం ధ్వంసం చేసేందుకు వినియో గించిన సుత్తులు, ఇతర పరికరాలు, వారు వాడిన తుఫాన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరచి, న్యాయాధికారి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ మహేశ్, ఎస్ఐ గోకారి పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

» రూ. 2.60 లక్షల విలువైన రాగి తీగ చోరీ

వంగూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలం, సర్వారెడ్డిపల్లి తండా గేటు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగి తీగను ఎతుకెళ్లారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సర్వారెడ్డిపల్లి తండా గేటు సమీపంలోని భగీరత ఫెర్టిలైజర్ కంపెనీకి చెందిన ట్రాన్స్‌ఫార్మన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి ధ్వంసం చేశారు. అందులోని రూ. 2.60 లక్షల విలువైన రాగి తీగను ఎత్తుకెళ్లారు. సంఘటనపై బాధితుడు నరేశ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మహేందర్ గురువారం సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

మహమ్మదాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఒక వైపు వేధిస్తున్న అనారోగ్యం, మరో వైపు ఇటీవల తల్లి మృతి చెందడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నంచర్ల గ్రామానికి చెందిన బంటు హన్మంతు (34) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆయన తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆయన మంగళవారం పొలం వద్దకు వెళ్లి గుర్తుతెలియని మందు తాగి స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబసభ్యులు గమనించి, మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు బంటు మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



క్రీడల్లో రాణించి.. కొలువు సాధించి...

» ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన ఉమ్మడి పాలమూరు యువకులు » స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాల సాధన

“ చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి. ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగితే భవిష్యత్తు బంగారం అవుతుంది. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చు' అని సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు పదే పదే చెప్తూ ఉంటారు. అది ముమ్మాటికీ వాస్తవమని ఉమ్మడి పాలమూరు జిల్లా క్రీడాకారులు నిరూపించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి ఆటల పోటీల్లో రాణించిన పలువురు యువకులు క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో శారీరక దారుడ్యం, మానసిక ఉల్లాసం లభించడంతో పాటు అద్భుతమైన భవిష్యత్తు కూడా సిద్ధిస్తుందని ఉమ్మడి పాలమూరు జిల్లా యువకులు నిరూపించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థులను మెరిట్ ప్రకారం ఎంపిక చేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి మొదటి ప్రాధాన్యం, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన వారికి ద్వితీయ ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన వారికి ఆ తర్వాత ప్రాధాన్యం ఇస్తారు. ఒక వేళ ఇద్దరికి ఒకే మెరిట్ ఉంటే వయసును పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన కొందరు క్రీడాకారులను ఇటీవల 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ఆ వివరాలిలా ఉన్నాయి.

పోలీసు కానిస్టేబుల్‌గా..

మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలం, తాటిపర్తి గ్రామానికి చెందిన మహమ్మద్ జలాలొద్దీన్, ఖాజాబేగం దంపతులు మహబూబ్‌నగర్ పట్టణంలోని బీకేరెడ్డి కాలనీలో నివసిస్తున్నారు. వారి కుమారుడు మహ్మద్ సమీరుద్దీన్ భగీరథ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. అప్పుడు పీఈటీ జియావుద్దీన్ సహకారంతో హ్యాండ్‌బాల్ క్రీడలోకి ప్రవేశించాడు. కోచ్ అహ్మద్‌హుస్సేన్ ఆధ్వర్యంలో శిక్షణ పొంది, చదువుతో పాటు, హ్యాండ్‌బాల్ క్రీడలో రాణించాడు. సీనియర్, జూనియర్, ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. 15 రాష్ట్ర స్థాయి, రెండు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొన్నాడు. క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం సాధించాడు. 2024 వరంగల్ జిల్లా మణికొండ సిటీ పోలీస్ శిక్షణ కళాశాలలో సివిల్ కానిస్టేబుల్‌గా తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్నాడు.



తల్లిదండ్రులు మహమ్మద్ జలాలొద్దీన్, ఖాజాబేగంలతో మహమ్మద్ సమీరుద్దీన్,



పోలీసు ఉద్యోగానికి ఎంపిక

శివకుమార్‌ది మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలం. కొండాపూర్ గ్రామం. తల్లిదండ్రులు కృష్ణయ్య, సువర్ణ. కృష్ణయ్య వ్యవసాయంతో పాటు, ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుమారుడిని చదివించాడు. మామ, బాబాయ్‌లు వాలీబాల్ క్రీడాకారులు కావటంతో తాను కూడా అదే దారిలో ముందుకు సాగాడు. సౌత్ సెంట్రల్ రైల్వే క్రీడాకారుడు మహ్మద్ అజార్‌అలీ అతడికి ప్రోత్సాహం అందించాడు. జిల్లా కేంద్రంలోని అపెక్స్ సెంట్రల్ స్కూల్, వాగ్దేవి జూనియర్ కళాశాల, ఎంవీఎస్ డిగ్రీ కళాశాలల్లో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. ఎనిమిది సార్లు రాష్ట్ర స్థాయి, మూడు సార్లు జాతీయస్థాయి టోర్నీల్లో పాల్గొన్నాడు. 2022లో ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అలాగే క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం కూడా సాధించాడు. ఇష్టంతో ఆడిన వాలీబాల్ ఈ రోజు నాకు ఉద్యోగాన్ని సాధించి పెట్టిందని శివకుమార్ తెలిపారు. 2024 వరంగల్ జిల్లా మణికొండ సిటీ పోలీస్ శిక్షణ కళాశాలలో సివిల్ కానిస్టేబుల్‌గా తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్నాడు.



కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకున్న వాలీబాల్ క్రీడాకారుడు శివకుమార్

ఆఫీస్ సూపరింటెండెంట్‌గా..

కిష్టయ్య తిరుమణిది నాగర్‌కర్నూల్ జిల్లా. తల్లిదండ్రులు వెంకటయ్య, మల్లమ్మ. కల్వకుర్తి మండలం, ఊర్కొండ పేట గ్రామం. ఊర్కొండ పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎనిమిదవ తరగతి వరకు చదు వుకున్నాడు. మెదక్‌లోని సాయ్ హాస్టల్‌లో సీటు సాధించి 9వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యను పూర్తి చేశాడు. వ్యాయామ ఉపాధ్యాయులు బాల్ రాజ్, యాదయ్య సహకారంతో క్రీడల్లో చేరాడు. 20పై జాతీయస్థాయి అథ్లెటిక్స్ టోర్నీ పాల్గొన్నాడు. 2015 క్రీడా కోటాలో ఆదాయ పన్నుల శాఖలో ఆఫీస్ సూపరింటెండెంట్ ఉద్యోగం సాధించాడు. హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు.



ఆదాయపన్నుల శాఖలో ఉద్యోగం సాధించిన క్రిష్టయ్య తిరుమణి



రవికుమార్‌ను సన్మానిస్తున్న లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ నాగురావు నామాజీ(ఫైల్)

ఆదాయ పన్నుల శాఖలో ..

రవికుమార్‌ది నారాయణపేట జిల్లా, దామరగిద్ద గ్రామం. తల్లిదండ్రులు నర్సింహులు, విజయలక్ష్మి. రవికుమార్ ప్రాథమిక, ఉన్నత, ఇంటర్మీడియట్ వరకు గ్రామంలోనే చదువుకున్నాడు. ఆ తర్వాత నిజాం కాలేజీలో డిగ్రీ, ఎంపీఈడీ పూర్తి చేశాడు. పాఠశాల స్థాయిలో పీడీ రమణ ప్రోత్సాహంతో అథ్లెటిక్స్‌లో రాణించాడు. మహబూబ్‌నగర్ స్టేడియంలో శిక్షణ పొంది అథ్లెటిక్ కోచ్‌లు ఆనంద్, సునీల్ సహకారంతో సాయి స్పోర్ట్స్ హాస్టల్‌లో సీటు సాధించాడు. అక్కడ ద్రోణాచార్య పురస్కార గ్రహీత నాగపూరి రమేష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందాడు. రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభను చాటి పతకాలు సాధించాడు. 20కి పైగా జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొన్నాడు. 2023లో క్రీడా కోటాలో కొలువు సాధించాడు. బెంగళూరు, ఆదాయ పన్నుల శాఖలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

ఆర్మీ ఉద్యోగం సాధించి దేశ సేవలో..

జిల్లా కేంద్రంలోని టీటీగుట్టకు చెందిన చంద్రశేఖర్. తల్లిదండ్రులు పోషన్న, భీమమ్మ. టీడీ గుట్ట హై స్కూల్ లో చంద్రశేఖర్ ఎనిమిదవ తరగతి వరకు చదివాడు. మెదక్ సాయ్ హాస్టల్ సీటు సాధించి ఇంటర్ వరకు విద్యను అభ్యసించారు. 10కి పైగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. అన్న, తమ్ముడు క్రీడాకారులు కావటంతో, వారి స్ఫూర్తితో తానూ క్రీడల్లో రాణించాడు. స్టేడియంలో కోచ్‌లు సునీల్, ఆనంద్ వద్ద అథ్లెటిక్స్ శిక్షణ పొందాడు. 21 ఏళ్ల వయస్సులో క్రీడా కోటాలో, ఆర్మీ ఉద్యోగం సాధించి, దేశ సేవ చేస్తున్నాడు.



ఆర్మీ ఉద్యోగం సాధించిన జి.చంద్రశేఖర్

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన విద్యార్థి



బాబూనాయక్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూ ల్ జిల్లా, అచ్చంపేట మండలం, దేవులాతండాకు చెందిన బాబూనాయక్ బాల్ బాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గత నెల ఎనిమిది, తొమ్మిది, 10 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆయన ప్రతిభతో రాణించారు. కర్ణాటక రాష్ట్రంలోని కొడగు జిల్లా, కుశాల్‌నగర్‌లో ఈ నెల ఆరు నుంచి ఎనిమిది వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనను న్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనను తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

అలంపూర్ ఆలయాల అభివృద్ధికి కృషి

» విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి

అలంపూర్ చౌరస్తా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. పాలక మండలి సభ్యులతో కలిసి బుధవారం ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆలయ పవిత్రతను కపాడుతునే ఆదాయ వనరులు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి భక్తుల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం, లాకర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్వామి, అమ్మ వార్ల ఆలయాలకు ప్రతీ సంవత్సరం ఆదాయం పెరుగుతోందన్నారు. టెండర్ల ద్వారా గతంలో రూ. 1.80 కోట్ల ఆదాయం వచ్చేదని, ఈ ఏడాది రూ. 3.48 కోట్లు వచ్చాయని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మపై ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో నమోదైన కేసు పూర్తిగా ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉందన్నారు. ఈ విషయంపై కొందరు వేర్వేరు చోట్ల ఫిర్యాదులు చేస్తూ ఆలయ విశిష్టతను దెబ్బతీస్తున్నారని తెలిపారు. ఎవరు తప్పు చేసినా క్షేమించేది లేదని, అందులో ఇతరుల జోక్యం అనవసరమని స్పష్టం చేశారు. ఆనంద్ శర్మ విషయంపై నాలుగు రోజుల క్రితం ఎన్‌డోమెంట్ కమిషనర్‌కు నివేదికను పంపించినట్లు తెలిపారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు ప్రాగటూరు గోపాల్, జగన్ మోహన్ నాయుడు, నాగశిరోమణి, జగన్‌గౌడ్, సరస్వతి, పులేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొంకల నాగేశ్వర్‌రెడ్డి, చిత్రంలో నాగశిరోమణి, వెంకటేశ్వర్లు

సంక్షేమం వణుకు





మక్తల్ మండల కేంద్రంలో ప్రహరీ కూలిపోయిన ఎస్సీ బాలికల వసతిగృహం, (ఇన్‌సెట్లో) బాలానగర్ ఎస్టీ గురుకుల పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వసతి ఈ జిల్లాలోని ఏ గురుకులంలోనూ లేదు. భోజనం కూడా మెనూ ప్రకారం పెట్టక పోగా నాణ్యంగా ఉండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ప్రస్తుతం మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తుండటంతో పరిస్థితి కొంత మెరుగైనప్పటికీ ఇంకా పర్యవేక్షణ పెంచి వసతులు కల్పించాల్సి ఉంది.

నీటి కొరత, విషసర్పాల సంచారం

వనపర్తి జిల్లాలోని గురుకులాల్లో వసతి పొందుతున్న విద్యార్థులు చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దమందడి మండల కేంద్రంలో ఉన్న బీసీ వసతిగృహానికి తలుపులు, కిటికీలు లేవు. రాత్రి వేళలో చల్లటిగాలి వీస్తుండటంతో సతమతమవుతున్నారు. అమరచింత ఎస్సీ బాలుర వసతిగృహం తండా సమీపంలో ఉంటుంది. ఈ హాస్టల్‌లో ఐదు గదుల్లో 120 మంది విద్యార్థులు ఉంటారు. వసతిగృహానికి ప్రహరీ లేదు. తరచూ విషసర్పాలు వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. ఇక్కడ మంచినీటి బోరు చెడిపోవడంతో ఐదు నెలలుగా పట్టించుకోవడం లేదు. తాత్కాలికంగా మిషన్ భగీరథ ద్వారా నీరందిస్తున్నారు. మదనాపూర్ ఎస్సీ గురుకులంలో పాఠశాల ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలతో ఉన్నది. సరిపడా దుప్పట్లు ఉన్నప్పటికీ చన్నీటి స్నానంతో ఇబ్బందులు పడుతున్నారు. పెబ్బేరు మండల కేంద్రంలోని సావిత్రీబాయి పూలే బాలికల వసతి గృహంలో 470 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేటు భవనంలో కొనసాగుతుండటంతో సౌకర్యాలు సరిగా లేవని విద్యార్థులు చెబుతున్నారు. ఆత్మకూరు మండలంలో బీసీ, ఎస్సీ ఎస్టీ బాలికల వసతి గృహాలు ఉన్నాయి. బీసీ వసతి భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రైవేటు భవనంలో వసతి ఏర్పాటు చేశారు. ఈ మూడు వసతి గృహాల్లో చన్నీటి స్నానంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

బెడ్‌షీట్లు కొరత.. జర్కిన్లతో ఊరట

నారాయణపేట జిల్లావ్యాప్తంగా ఆరు ఎస్సీ గురుకులాలు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో బెడ్‌షీట్లు ఇంకా అందలేదు. ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టామని, త్వరలో వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు కావాల్సినన్ని ఇచ్చారు. నారాయణపేట మండలం సింగారం చౌరస్తాలోని బాలుర గురుకులంలో దుప్పట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలు ధ్వంసం కావడం, బాత్రూమ్‌లకు తలుపులు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ప్రధాన గేటు కూడా లేకపోవడంతో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. చలికి తట్టుకోలేక ఇళ్ల నుంచి జర్కిన్లు తెప్పించుకుంటున్నారు. రెండు మైనారిటీ గురుకులాలు ఉండగా అవి అద్దె భవనాల్లో అరొకర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. జిల్లాలో నాలుగు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాలు ఉండగా అవి కూడా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

దోమల మోత, అపరిశుభ్రత

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 24 వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో 15 బీసీ, 8 ఎస్టీ హాస్టళ్లు ఉండగా కొన్ని వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో అక్కడ సౌకర్యాలు సరిగా లేవు. రాజాపూర్ కేజీవీబీలోని రెండో అంతస్తులో కిటికీలు పూర్తిగా లేకపోవడంతో విద్యార్థులు రాత్రివేళ భోజనశాలలో పడుకుంటున్నారు. కిచెన్ షెడ్లు లేకపోవడం, బియ్యంలో పురుగులు వస్తుండటంతో నిత్యకృత్యంగా మారింది. అలాగే బాత్‌రూంలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. చాలా చోట్ల స్కావెంజర్లు లేకపోవడంతో మరుగుదొడ్లు దుర్గంధంగా తయారయ్యాయి. మూసాపేట ఎస్సీ వసతిగృహంలో గదులు శిథిలావస్థకు చేరాయి. బాత్‌రూమ్‌లు కూడా పాడయ్యాయి. చాలా హాస్టళ్లలో భోజనం నాణ్యంగా ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారు. బాలానగర్ ఎస్సీ గురుకులంలో బాత్‌రూమ్‌లు శుభ్రం చేయడానికి స్కావెంజర్లు లేక అపరిశుభ్రంగా ఉన్నాయి. జడ్చర్ల పట్టణంలో ఐదు, మల్లెబోయిన్‌పల్లి సమీపంలో మూడు గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఉర్కొండపేట, బాలానగర్, నవాబ్‌పేట మండలాల గురుకుల పాఠశాలలు కూడా కొనసాగుతున్నాయి. కొన్ని వసతిగృహాలకు కిటికీలు, మెష్‌లు లేవు. దీంతో చలి తీవ్రతతో పాటు దోమల బెడద కూడా తీవ్రంగా ఉన్నదని విద్యార్థులు చెబుతున్నారు. నవాబ్ పేట మండలం ఒక ఎస్సీ, ఒక బీసీ వసతిగృహాలు ఉన్నాయి. బీసీ వసతిగృహంలో గదులు సరిపోవడం లేదు. కళాశాల వసతిగృహం అద్దె భవనంలో కొనసాగుతోంది.

కోళ్ల ఫారాల్లోనే వసతి

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఎంజేపీ గురుకులాలు మొత్తం 40 ఉండగా.. 16472 మంది విద్యార్థులు చదువుతున్నారు. అద్దె భవనాల్లో చాలా గురుకులాలు కొనసాగుతున్నాయి. కొన్ని వసతి గృహాలు పౌల్ట్రీ ఫామ్స్‌లో ఉండటంతో చలికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వేడి నీటి సౌకర్యం ఏ గురుకులంలోనూ లేదు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో ఇరుకు గదులతో ఇబ్బందులు ఎదు రవుతున్నాయి. భోజనశాలలు అపరిశుభ్రంగా ఉన్నాయి. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నప్పటికీ.. నాణ్యత ఉండటం లేదని విద్యార్థులు చెప్తున్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

'కార్పొరేట్'ను కట్టడి చేయాలి

» పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్

పాలమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ విద్యారంగాన్ని కట్టడి చేయాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక వనరులు, అవకాశాలు స్థానికులకే దక్కాలనే ప్రధాన డిమాండ్‌తో తెలంగాణ ఉద్యమం కొనసాగిందని తెలిపారు. ప్రత్యేకించి విద్యారంగంలో శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల అక్రమాలను, దోపిడీని పెద్దస్థాయిలో బహిర్గత పరిచిందని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కాగానే, ఆ సంస్థలను రాష్ట్రం వెలుపలికి పంపిస్తామని ఆనాటి ఉద్యమ రాజకీయ నాయకత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్పందించిందని తెలిపారు. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఫలితంగా ఆ విద్యాసంస్థలు ప్రభుత్వ కాలేజీలను దివాలా తీయించడమే కాకుండా ఇంటర్ విద్యాబోర్డును అవినీతిమయం చేసి, అబద్ధపు ప్రచారాలతో బలపడ్డాయని గుర్తు చేశారు. ఇప్పుడా సంస్థలు తమ దందాను విస్తరిస్తూ జిల్లాలకు వస్తున్నాయని తెలిపారు.

ప్రజలకు హక్కుగా, ఉచితంగా దక్కాల్సిన విద్యను ప్రైవేటు వ్యాపార రంగానికి అప్పగించటమే కాక, దుర్మార్గంగా కార్పొరేట్లకు స్వాధీనపరచడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికే పేద, మధ్య తరగతి వర్గాలు తమ బిడ్డల చదువు కోసం అప్పులపాలై అందోళనలో ఉన్నారని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు మహబూబ్ నగర్ వంటి పట్టణాలకు రావడం మధ్య తరగతి కుటుంబాలకు మరింత భారంగా పరిణమిస్తుందని అందోళన వ్యక్తం చేశారు. వారి అబద్ధపు ప్రచారాలను తట్టుకోవటం ప్రభుత్వ విద్యాసంస్థలు, సాధారణ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సాధ్యం కాదని ఇది విద్యారంగ సంక్షోభాన్ని తీవ్రం చేస్తుందని పేర్కొన్నారు.

మునుముందు కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వాన్నే శాసించే స్థాయికి వస్తాయని తెలిపారు. కాబట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని నివారించడం కోసం, కార్పొరేట్ విద్యా సంస్థలు జిల్లాలకు విస్తరించకుండా నియంత్రించాలని, అందుకోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ నెల 14న 'సమూహ' తొలి రాష్ట్ర మహాసభ

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం తొలి రాష్ట్ర మహాసభను ఈ నెల 14న నిర్వహించనున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను బుధవారం పాలమూరు విశ్వవిద్యాలయం ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పట్ట ం లోని క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానున్నదని చెప్పారు. ఈ సంద ర్భంగా 'లౌకిక ప్రజాస్వామ్య జీవన సంస్కృతి - సాహిత్యం', 'పాలమూరు సమాజం, సాహిత్యం', 'బహుళ అస్తిత్వాలు - సాంస్కృతిక జాతీయ వాద సవాళ్లు' అంశాలపై సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 20 మంది ప్రముఖుల స్వీయ కవితా పఠనం కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఇంటర్వ్యూ..

పశు సంపద వృద్ధికి కృషి

» పశువైద్యాధికారి రవిచంద్ర



నవాబ్‌పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పశు సంపద వృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల పశువైద్యాధికారి రవిచంద్ర అన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతీ నెల క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలు వివరించారు.

మండలంలో పశువులు, మేకలు ఎన్ని? పశువైద్యశాలలు ఎన్ని?

పశువులు, గేదెలు, ఆవులు కలిపి 8 వేలు ఉండగా, గొర్రెలు, మేకలు కలిపి 52 వేలు ఉన్నాయి. కొల్లూర్, నవాబ్‌పేట గ్రామాల్లో పశు వైద్యశాలలు ఉండగా, పోమాల, కాకర్లపాడ్, కారుకొండ, లింగంపల్లి, ఇప్పటూర్ గ్రామాల్లో ఉప కేంద్రాలు ఉన్నాయి.

సిబ్బంది, మాత్రల కొరత ఉందా?

నవాబ్‌పేట ఆసుపత్రికి డాక్టర్ లేనందున ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నాను. కొన్ని గ్రామాల్లో కిందిస్థాయి సిబ్బంది ఉన్న మాట వాస్తవమే. కానీ ఈ పరిస్థితి అధిగమిస్తున్నాం. మాత్రలు, మందులు ప్రతీ మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వం అందజేస్తుంది. అడిగిన ప్రతీ రైతుకు మందులు ఇస్తున్నాం.

సిబ్బంది అందుబాటులో లేదన్న ఆరోపణలు ఉన్నాయి?

ఈ విషయమై మాకు ఫిర్యాదులు వచ్చాయి. కానీ సిబ్బంది కొరత కారణంగా ఈ సమస్య ఉన్నట్లు మేము అధికారులకు ఫిర్యాదు చేశాం. రైతులు ఏమైన ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి.

న్యూస్ బాక్స్

పాఠశాలకు టేబుళ్లు, కుర్చీల వితరణ

అడ్డాకుల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు బుధవారం ప్రగతి స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యజమాని ఆళ్ల జితేంద్రప్రసాద్‌బాబు సహకారంతో కంపెనీ జనరల్ మేనేజర్ గుట్టపల్లి రమేశ్‌బాబు 12 టేబుళ్లు, 20 కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జీఎంను సన్మానించారు. హెచ్‌ఎం జ్యోతి, ఆఫీస్ మేనేజరు తుమ్మల శివప్రసాద్, అకౌంట్స్ మేనేజరు తుమ్మల ప్రవీణ్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా విక్రంతేజ గౌడ్

కోయిలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వేముల విక్రంతేజ గౌడ్ ఆన్‌లైన్ ఓటింగ్ 1,229 ఓట్లతో గెలుపొందారు. కోయిలకొండ యువజన కాంగ్రెస్ అధ్యక్ష పోటీలో ఐదుగురు యువకులు పోటీ పడగా, అందులో ఇద్దరు వైదొలగగా, ముగ్గురు పోటీ పడ్డారు. రెండో స్థానంలో వంశీకృష్ణ 994 ఓట్లు, మూడో స్థానంలో బండారి బాల్‌రాజ్ 448 ఓట్లు వచ్చాయి. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలుపొందిన విక్రంతేజ గౌడ్‌ను బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విద్యాసాగర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు జగన్‌గౌడ్, శేఖర్ అభినందించారు.

సభకు తరలిన నాయకులు

మిడ్జిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అంతకుముందు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తరలివెళ్లిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్‌నాయక్, మండల అధ్యక్షుడు నరేందర్, వాసుదేవ్, భాస్కర్, వెంకటరెడ్డి, జంగయ్య, శేఖర్, బాలు ఉన్నారు.

ఇసుక తరలింపునకు అనుమతులివ్వొద్దు

మిడ్జిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వొద్దని గ్రామానికి చెందిన రాగుల రమేష్, లక్ష్మయ్య, శంకర్ బుధవారం అధికారులను కోరారు. పట్టా భూమి పేరుతో అనుమతి పొంది ప్రభుత్వ భూమిలో ఇసుకను తరలించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇటీవల ఇదే విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఇసుక తరలింపునకు అనుమతి ఇస్తే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

హన్వాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హన్వాడకు చెందిన నజీర్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు మారెపల్లి సురేందర్‌రెడ్డి అంత్యక్రియల నిమిత్తం బుధవారం రూ.10 వేలు అందజేయగా, మండల అధ్యక్షుడు మహేందర్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. షబ్బీర్ ఆంజనేయులు, సత్యం, దాసరి వెంకటయ్య, అరేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

జడ్చర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ 5వ వార్డు పరిధిలోని నాగసాల, నిమ్మబావిగడ్డ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పాలకులు, అధికారులు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. బుధవారం 5వ వార్డులో పర్యటించి కాలనీలోని సీసీ రోడ్లు గుంతలు పడడం, వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళ విష పురుగులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జయరాం, శ్రీశైలం, సంధ్యారాణి, బందిగమ్మ, శ్యామ్‌సుందర్, కేశవులు పాల్గొన్నారు.

అడ్డంకులున్నా సంక్షేమ పథకాలు

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి » 100 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మహబూబ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పడి సరిగ్గా ఏడాది అవుతుందని, ఈ క్రమంలో ఎన్ని అడ్డంకులున్నా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 100 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రైతు పండగలో జిల్లా అభివృద్ధికి తీసుకునే చర్యలు చెప్పారని, పాలమూరు బిడ్డ సీఎం కావడం జిల్లాకు వరమన్నారు. నాయకులు షబ్బీర్ అహ్మద్, మల్లు నర్సింహ్మారెడ్డి, లక్ష్మణ్ యాదవ్, సిరాజ్‌ఖాద్రి, అనిత, మహేందర్, జాజిమొగ్గ నర్సింహులు, ఖాజాపాషా, తిరుమల వెంకటేశ్, లతాశ్రీ, మునీర్, రాములుయాదవ్, సుద్దాలం సుధాకర్‌రెడ్డి, నవనీత, వెంకటయ్య, టంకర కృష్ణయ్య పాల్గొన్నారు.

అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

మహబూబ్‌నగర్ విద్యా విభాగం : పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అల్మదీనా బీఎడ్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ ఒక విద్యాసంస్థను నెలకొల్పి 40 సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలు మరువ లేనివన్నారు. అనంతరం విద్యార్థులకు సొంత నిధులతో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ సజ్జద్ అహ్మద్, జనరల్ సెక్రటరీ మహ్మద్ ఇమ్తియాజ్, అహ్మద్ కాస్మిక్, ప్రిన్సిపాల్ షబీర్ బాషా ఉర్, జిల్లా మైనార్టీ సెల్ నాయకుడు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే



రంగారెడ్డిగూడ గ్రామంలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని రంగారెడ్డిగూడలో సీసీ రోడ్లు, సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కల్లేపల్లిలో సీసీరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రారంభోత్సవం, నాన్‌చెరువు తండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, సోమ్లు నాయక్‌తండాలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, ఈద్గాన్‌పల్లిలో డ్రైనేజీని ప్రారంభించి, సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా రాజాపూర్ మండల కేంద్రంలో నాలుగు సీసీ రోడ్లతో పాటు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, చెన్నవెల్లిలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, దొండ్లపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణాని కి శంకుస్థాపన చేశారు.

రైతుల సంక్షేమానికి కృషి

బాలానగర్ : రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసమే సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని నందారం, నేరళ్లపల్లి, గౌతాపూర్ గ్రామాల్లో రూ.పది కోట్లతో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గంగాధర్‌పల్లిలో గ్రామ పంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అశ్విని రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు కేఎస్‌ఆర్ వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, నర్సింగ్‌నాయక్, సాదు వెంకట్‌రెడ్డి, నరసింహారెడ్డి, రఘుయాదవ్, మహేష్ యాదవ్, మల్లారెడ్డి, అంజయ్యయాదవ్, నర్సింహ్మారెడ్డి, నందీశ్వర్, సత్యనారాయణరెడ్డి, కిషన్‌నాయక్, యాద య్య, సుధాకర్‌గౌడ్, భద్రు, పర్వత్‌రెడ్డి, ప్రతాప్, యాదయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై చార్జిషీట్

» బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు నాగురావు నామాజీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై భారతీయ జనతా పార్టీ ప్రజా కోర్టులో చార్జిషీట్ వేయడం జరిగిందని, ముఖ్యమంత్రికి దమ్ముంటే రాతపూర్వకంగా జవాబు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు నాగురావు నామాజీ సవాలు చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయం నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ రాష్ట్రంలో గద్దెనెక్కేందుకు ఆరు గ్యారెంటీలకు 66 అబద్దాలు చెప్పారన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్న ప్రజలకిచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. మోదీ హయాంలో ప్రపంచంలో భారతదేశం 3వ ఆర్థిక వ్యవస్థ అవతరించడంతో పాటు పలు రంగాల్లో ముందుకెళ్తుందన్నారు. ఇప్పటికైనా ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. మోదీ ప్రభుత్వం పాలమూరు యూనివర్సిటీకి రూ.100 కోట్లు, మునిసిపాలిటీకి రూ.80 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. నాయకులు కె.రాములు, పాండురంగారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మెట్టుకాడి శ్రీనివాసులు, క్రిష్ణవర్ధన్‌రెడ్డి, అచ్చుగట్ల అంజయ్య, రామాంజనేయులు, పిట్టల యాదయ్య, రమేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సతీష్‌కుమార్, నారాయణ, సంపత్‌కుమార్, రఘురాంగౌడ్, రాజుగౌడ్, నారాయణపేట జిల్లా అధికార ప్రతినిధి నర్సంగౌడ్ పాల్గొన్నారు.

విజయం సాధించాలి

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ప్రతిభ కనబరచి విజయం సాధించాలని పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీ చెస్ మహిళల జట్టు బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్నానికి బయలుదేరి వెళ్లింది. అక్కడి గీతం యూనివర్సిటీలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొననున్నది. ఈ సందర్భంగా జట్టు సభ్యులకు ఆయన ట్రాక్ సూట్, యూనిఫాం అందించారు. రిజిస్ట్రార్ ప్రొ ఫెసర్ చెన్నప్ప, ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, చెస్ మేనేజర్ మౌనిక పాల్గొన్నారు.



క్రీడాకారులతో పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పెండింగ్ సర్వే బిల్లులు చెల్లించాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

పాలమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆశ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పోలియో సర్వే డబ్బులు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీప్లానాయక్, కురుమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆశవర్కర్లతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24లో చేసిన లెప్రసీ సర్వే డబ్బులు నేటికీ ఇవ్వకుండా సర్వే చేయాలని ప్రభుత్వం ఆశలపై ఒత్తిడి చేయటం సరికాదన్నారు. 2024లో చేసిన పల్స్‌పోలియో డబ్బులు సైతం నేటికి చెల్లించలేదన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో విచారిస్తే పెండింగ్‌లో ఉన్న డబ్బు విడుదల చేశామని తెలపగా, జిల్లా అధికారులు మాత్రం నేటికి బిల్లులు రాలేదని చెప్పటం ఆశ్చర్యంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదమ్మ, పద్మ, సావిత్రి, హైమావతి, రాజేశ్వరి, నర్సమ్మ, శివశీల, చంద్రకళ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుకు పాము కాటు

గండీడ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఓ రైతు పాము కాటుకు గురైన సంఘటన మండలంలోని కొంరెడ్డిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన వెంకట్‌రాములు పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేయగా, కుటుంబీకులు మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం ఇవ్వాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఇవ్వాలని బుధవారం కలెక్టర్ విజయేందిర బోయికి టీఎస్ జీహెచ్‌ఎంఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అనంతప్ప, జగదీష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలకు మధ్యాహ్న భోజనాన్ని అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. కోశాధికారి అబ్దుల్ హక్, నాయకులు శ్రీనివాసులు, సీఎంవో బాలు యాదవ్, జీహెచ్‌ఎం రాజలింగం పాల్గొన్నారు..

7న పిల్లలమర్రి హజ్రత్ జమాల్ షా ఖాద్రీ గంధోత్సవం

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పిల్లలమర్రి హజ్రత్ జమాల్ షా ఖాద్రీ, హజ్రత్ కమాల్ షా ఖాద్రీ 649 ఉర్సు ఈ నెల 7 నుంచి 9వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా ముతవల్లి షా మహ్మద్ ఫజల్‌ఖాన్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఆహ్వానం అందజేసి, సత్కరించారు. 7న జలాభిషేకం, 8న గంధోత్సవం, 9న దీపాలంకరణ ఉంటుందని తెలిపారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

హన్వాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా కిష్యానాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన మండల కమిటీ ఎన్నికలో ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య, కోశాధికారిగా వెంకటరమణ, సభ్యులుగా రాజేశ్వరి, కరుణాకర్‌గౌడ్, కవిత, అబ్దుల్ రహూఫ్ ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, రాష్ట్ర నాయకుడు కిష్టయ్య పరిశీలకులుగా వ్యవహరించారు.

నేటి నుంచి సదరం క్యాంపులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి ఈనెల 5 నుంచి 31 వరకు జిల్లా ఆసుపత్రిలో దివ్యాంగులకు సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారి నర్సింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవారితో పాటు రెన్యూవల్ వారు కూడా హాజరుకావాలన్నారు. ఇందుకు గాను మీసేవలో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

కోయిలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అయ్యప్ప పడిపూజను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకం, 18 పడి మెట్లకు పూజలు నిర్వహించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

కోయిలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాల్‌చేడ్ వాగు నుంచి అనుమతి లేకుండా బుధవారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. టిప్పర్లతో పాటు గోవిందు, బుచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మిడ్జిల్/ దేవరకద్ర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు అన్నారు. మండలంలోని వస్పుల ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది పర్వతాచారి, హెచ్‌ఎం రాములు ఉన్నారు. దేవరకద్ర మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఐ నాగన్న విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

పోలింగ్ బూత్‌ల నివేదిక సిద్ధం చేయాలి

కోయిలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలకు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను సిద్ధం చేసి, వివరాలు అందించాలని ఎంపీడీవో కాళప్ప సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే పోలింగ్ బూత్‌ల ఏర్పాటుపై సమీక్షించారు. మండలంలో 44 సర్పంచ్‌లు, 380 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించేందుకు పోలింగ్ బూత్‌లలో వసతుల కల్పన తదితర అంశాలపై గ్రామాల వారిగా నివేదికలు అందించాలన్నారు. ఎంపీవో నసీర్‌అహ్మద్, సూపరింటెండెంట్ హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

» జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్



కప్పెట పాఠశాలలో విద్యార్థులకు అందించే గుడ్లను పరిశీలిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

భూత్పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని కప్పెట ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల్లో నిర్వహిస్తున్న ఎన్‌ఏఎస్ పరీక్షతో పాటు విద్యార్థులకు అక్షయ పాత్ర ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను పరిశీలించి, విద్యాబోధనపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్‌ఎం వెంకట్‌నారాయణకు సూచించారు. అనంతరం మండలంలోని పాతమొల్లర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఆర్పీ ఠాకూర్ పాల్గొన్నారు.

ఘనంగా మహబూబ్‌నగర్ అవతరణ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ బహదూర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో బుధవారం టీడీగుట్టలో సంఘం కార్యాలయంలో 134వ మహబూబ్‌నగర్ అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహబూబ్‌అలీఖాన్ చేసిన సేవలను కొనియాడారు. ప్రతీ ఏడాది అవతరణ దినోత్సవం నిర్వహించడం పట్ల అబ్దుల్‌రహీం అభినందించారు. ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్, నాయకులు అబ్దుల్‌హదీ, హనీఫ్ అహ్మద్, ఫారుక్ హుస్సేన్, మోసీన్‌ఖాన్, సమాద్‌ఖాన్, బాబర్‌షేక్, ఖలీల్, రఫీక్ పటేల్, జావెద్ తదితరులు పాల్గొన్నారు.

కోట్లాది హృదయాల్లో ఘంటసాల గానం పదిలం



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సంగీత కళాశాల సభ్యులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగు చలన చిత్ర రంగం తొలినాళ్లలో ఆయన గానంతో కోట్లాది మంది హృదయాలను గెలిచిన గాయకుడు ఘంటసాల అని సంగీత కళాశాల సభ్యులు కీర్తించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఘంటసాల సంగీత కళాశాల ప్రాంగణంలో ఘంటసాల జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుర్వ రాములు, వెంకటస్వామి, ప్రసాద్, లక్ష్మణ్, నారాయణ, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

● జడ్చర్ల : ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని జడ్చర్లలోని విద్యానగర్ కాలనీలో విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి విశ్రాంత ఉద్యోగులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కండేరెడ్డి, నర్సిములుగౌడ్, నయీమొద్దీన్, శంకర్‌బాబు, సిరాజ్, బుచ్చిరెడ్డి, విశ్వనాథం, ఇమామ్, సుధాకర్‌రెడ్డి, చలపతి, సత్యనారాయణరెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సీఎం కప్‌ను విజయవంతం చేయాలి

కోయిలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్న సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌గౌడ్ తెలిపారు. బుధవారం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 7, 8వ తేదీల్లో గ్రామ స్థాయిలో, 10, 11వ తేదీల్లో మండల స్థాయిలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణకు కమిటీని నియమించడం జరిగిందని, ఇందులో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఎస్‌ఐ ఉంటారని వెల్లడించారు. తహసీల్దార్ రాజా గణేష్, ఎంపీడీవో కాళప్ప, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, ఎంఈవో వెంకట్‌జీ, సూపరింటెండెంట్ హరీష్‌రెడ్డి, పీఈటీలు మొగులాల్, ఉమాపతిరెడ్డి, నాగరాజు ఉన్నారు.

నైపుణ్యాల పెంపునకు సదస్సులు అవసరం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు సదస్సులు ఎంతో అవసరమని జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌సీఈలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో మూడురోజులు పాటు వర్క్ షాప్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన ఆర్య డిజివర్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ, ఇంట్రడక్షన్ టు రోబోటిక్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు.

డేటా ఎంట్రీ ఆలస్యంపై కలెక్టర్ ఆరా

మిడ్జిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డేటా ఎంట్రీ ఆలస్యంపై కలెక్టర్ విజయేందిరబోయి ఆరా తీశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆలస్యంపై ఎన్యుమనేటర్లను ప్రశ్నించారు. వెంటనే డేటా ఎంట్రీని పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని బోయిన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, పరిసరాలను పరిశీలించారు. దీంతో పాటు బియ్యం, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఎంపీడీవో గీతాంజలి, ఎంపీవో జగదీశ్వర్ ఉన్నారు.



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

పీఆర్సీ అమలు చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని తపస్ జిల్లా ఇన్‌చార్జి వరప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తపస్ కార్యాలయంలో జిల్లా కమిటీ కార్యనిర్వాహక సమావేశం జిల్లా అధ్యక్షుడు బొల్లం సునీల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 17న సమస్యల సాధన కోసం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాబునాయుడు, రాష్ట్ర నాయకుడు కరుణాకార్‌గౌడ్, జిల్లా నాయకుడు రాజ్‌మోహన్‌రెడ్డి, తిప్పారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పారిశ్రామిక వాడలో నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజులుగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ క్లీనిక్‌లో పూర్తి స్థాయిలో డాక్టర్, ఫార్మాసిస్టులు లేరని, మందులు రావడంలేదని ఆవేదన చెందారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు జీబీ పాల్, భగవంతు, నారాయణ, ఉమేష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, రాములు, లలితమ్మ, భీమమ్మ పాల్గొన్నారు.